క్లుప్తంగా

కౌశిక్‌రెడ్డి దళిత ద్రోహి

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

జమ్మికుంట: దళితబంధును అడ్డుకున్న దళిత ద్రోహి హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో ఓ ప్రైవేటు ఫంక్షన్‌కు బుధవారం సాయంత్రం హాజరు కాగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కసుబోజుల వెంకన్న, సలీం పాషా స్వాగతం పలికారు. దళితబంధు పేరిట కౌశిక్‌రెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆధారాలతో బయట పెడతామన్నారు. ఇందిరానగర్ వద్ద ప్రచార సమయంలో ఇద్దరు చనిపోగా రూ.పదిలక్షలు ఇస్తామని బీఆర్ఎస్ ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. కౌశిక్‌రెడ్డి కపట రాజకీయాలు, గత చరిత్ర అందరికీ తెలుసని, జనవరి నుంచి హుజురాబాద్‌లో పర్యటిస్తానని ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యెగ్గని శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, శ్రీకాంత్, కార్తీక్ తదితరులున్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరం ఉండాలి

ఏసీపీ శ్రీనివాస్‌జి

హుజూరాబాద్: బ్యాంకుల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ బ్యాంక్‌లను సందర్శించి సీసీ కెమెరాల పనితీరును బ్యాంక్ మేనేజర్లను అడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీగార్డులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల నిర్వహణలో లోపాలు లేకుండా చూడాలన్నారు. బ్యాంక్‌ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వెంట సీఐ తిరుమల్‌గౌడ్ ఉన్నారు.

వాహనాల తనిఖీ

శంకరపట్నం: మండలంలోని తాడికల్‌లో బుధవారం పోలీసు క్యాంపు ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా దళితబంధు రెండో విడుత నిధుల కోసం అడ్డుకుంటారనే సమాచారం మేరకు కరీంనగర్ వెళ్లే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలను హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు పోలీసులు తనిఖీ చేశారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై ప్రత్యేక బలగాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ వెంకటి, ఎస్సైలు రవి, తిరుపతి, సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సుధాకర్


దొంత సుధాకర్

సైదాపూర్: సైదాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వెన్కెపల్లి గ్రామానికి చెందిన దొంత సుధాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా దొంత సుధాకర్, వైస్ చైర్మన్‌గా నాదెండ్ల రాజ్‌కుమార్, మెంబర్లుగా నెల్లి సదానందం, ఎండీ.చోటేమియా, గోపాల్‌రెడ్డి, సమ్మయ్య, పెద్ది తిరుపతి, బైరి రాజు, రాజయ్య, మద్దూరి రజిత, ఎర్రల శ్రీనివాస్, తాళ్లపల్లి వెంకటేశం, రాజశేఖర్, చైర్మన్ పీఏసీఎస్, వై.సైదాపూర్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ ఉపసంచాలకుడు హుజూరాబాద్, పంచాయతీ ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లపల్లిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన కమిటీ నియామకానికి కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు చైర్మన్ సుధాకర్, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ సర్పంచుల అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

గంగాధర: మండలంలోని మాజీ సర్పంచులను గంగాధర పోలీసులు అరెస్టు చేసి బుధవారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పదవికాలంలో చేసిన అభివృద్ధి పనులకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని వేములవాడలో జరిగే ముఖ్యమంత్రి సభలో నిరసన వ్యక్తం చేస్తారనే సమాచారంతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసుల అదుపులో తాజా మాజీ సర్పంచులు మడ్లపల్లి గంగాధర్, మేచినేని నవీన్‌రావు, లక్ష్మీరాజం, మేఘరాజు, నాయకులు సాగి మహిపాల్‌రావు, ఆదిమల్లు, అలువాల తిరుపతి తదితరులున్నారు.

కళాయాత్ర


గుండిలో పథకాలు వివరిస్తున్న కళాకారులు

రామడుగు: మండలంలోని రామడుగు, గుండి, గోపాల్‌రావుపేట గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కళాకారులు దుర్గం మురళీ, వాణీ, శంకర్, శ్రవణ్, శ్రీకాంత్, తిరుపతి, అర్చన, రాధ, సౌమ్య పలువురు పాల్గొన్నారు.

యాసంగి సాగుకు వేళాయే

- ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- దొడ్డురకం వరిసాగుకే రైతుల మొగ్గు
- ఎరువుల కొరత లేదు, నాణ్యమైన విత్తనాలు వేసుకోవాలని వ్యవసాయశాఖ సూచన


నారుమడి సిద్ధం చేస్తున్న రైతులు

వీణవంక: యాసంగి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత వానాకాలంలో సన్నరకం వరి వైపు మొగ్గు చూపిన రైతులు యాసంగిలో మాత్రం దొడ్డు రకం వరి పండించడానికి ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. సన్నరకానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో కొంత మేరా లాభాలు ఆర్జించారు. కొంత మంది రైతులు ఇప్పటికే నారుమడులు చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే యాసంగి పంట సాగు ప్రణాళికను వ్యవసాయాధికారులు సిద్ధం చేశారు. వీణవంక మండలానికి ఎస్సారెస్పీ వరప్రదాయిని దీంతో రైతులకు ఎస్సారెస్పీ నీరే ఆధారం. నీటిని వదిలితే ఈ పసల్‌కు ఎలాంటి ఢోకా లేదని రైతులు చెబుతున్నారు.

సాగు ప్రణాళిక సిద్ధం..

వానాకాలం సీజన్‌లో పుష్కలంగా వర్షాలు కురువడంతో పాటు ఎస్సారెస్పీ నీళ్లు అందడంతో రైతులు గట్టెక్కారు. గుంట భూమి వదలకుండా పంటలు సాగు చేశారు. వీణవంక మండలంలోని 26 గ్రామ పంచాయతీలు ఉండగా వరి 24 వేల ఎకరాలు, మొక్కజొన్న 3 వేల ఎకరాలు, ఇతర పంటలు 500 ఎకరాలలో సాగు చేసినట్లు అధికారులు నివేదికల్లో రూపొందించారు. ఎస్సారెస్పీ నీళ్లు దిగువకు వదిలేతే వరి సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. పెసర్లు, బబ్బర్ల వైపు రైతులు పెద్దగా ఆసక్తి చూపడంలేదు. అదేవిధంగా వరిలో హైబ్రిడ్ వరి (ఆడ, మగ) వైపే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఎరువులకు కూడా ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంటాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

కల్వల ఆదుకునేనా..?

వీణవంక, రెడ్డిపల్లి, మల్లన్నపల్లి, లస్మక్కపల్లి, రామకృష్ణాపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాలతో పాటు శంకరపట్నం మండలంలోని పలు గ్రామాలకు కల్వల చెరువు ఆధారం. అయితే గతేడాది భారీ వర్షాలకు కల్వల చెరువు కట్ట తెగిపోవడంతో చుక్క నీరు లేకుండా పోయింది. దీని పరిధిలో ఆయకట్టు 8వేల ఎకరాల వరకు ఉంటుంది. కల్వల చెరువును మినీ ఎల్ఎండీగా మార్చాలని గత ప్రభుత్వం ఎస్టిమేషన్ వేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడు మినీ ఎల్ఎండీపై నీలినీడలు అలుముకున్నాయి. కనీస మరమ్మతు చేస్తే ఆయకట్టు రైతులు గట్టెక్కే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు కలుగజేసుకొని కల్వలను మినీ ఎల్ఎండీగా మార్చాలని రైతులు కోరుతున్నారు.

వరి కొయ్యలు తగలబెట్టొద్దు

వానాకాలం పంట కోయగానే రైతులు వరికొయ్యలను తగలబెడుతున్నారు. దీనివల్ల భూసారం దెబ్బతిని పంటల దిగుబడిపై ప్రభావం పడుతుంది. ఎట్టి పరిస్థితుల్లో రైతులు కొయ్యలను కాల్చొద్దు. యాసంగిలో వరి ఎక్కువగా సాగులోకి రానుంది. అదేవిధంగా వ్యవసాయ బావుల్లో నీటిసాంద్రతను బట్టి నారుమళ్లు చేసుకోవాలి. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15వరకు నారు పోసుకుంటే మంచిది. డీఏపీ, యూరియా ఎరువులకు కొరత లేదు. రైతులు నాణ్యమైన విత్తనాలను వేసుకుంటే మంచిది.

– గణేశ్, వ్యవసాయ అధికారి, వీణవంక


చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్ గ్రామస్తులు వానర సైన్యంతో ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డువెంట వెళ్లేవారిని వెంబడిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. ఉదయం వేళ సీతారాంపూర్ నుంచి చిగురుమామిడి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కోతులను చూసి భయపడుతున్నారు. ఎవరో ఒకరు వచ్చి తరిమికొడితేనే పాఠశాలలకు వెళ్తున్నారు. కోతుల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
మధుసూదన్, ఎంపీడీవో, చిగురుమామిడి , సెల్‌నంబర్: 99124 11655

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

సన్నరకం పండించేలా ప్రోత్సహించాలి

పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్


చిగురుమామిడిలో తేమశాతాన్ని పరిశీలిస్తున్న చౌహాన్

చొప్పదండి/చిగురుమామిడి: సన్నరకం ధాన్యం పండించేలా రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వం ఇచ్చే రూ.ఐదువందల బోనస్‌తో లబ్ధిపొందాలని రాష్ట్ర పౌరసరఫరాలశాక కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. చిగురుమామిడిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి సందర్శించారు. సన్నరకం ఎక్కువగా పండిస్తే రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తామన్నారు. దళారులతో మోసపోవద్దని, తేమశాతాన్ని మిషన్‌ద్వారా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మంజుల, కోనేటి స్వప్న, బట్టు మాధవిని అభినందించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఎస్‌వో నర్సింగరావు, డీఎం రజినీకాంత్, తహసీల్దార్ రమేశ్, ఎంపీడీఓ మధుసూధన్, ఐకేపీ డీపీఎం సీహెచ్ ప్రవీణ్‌కుమార్, ఏఓ రాజులునాయుడు, ఏపీఎంలు ఎం రాజేశ్, ఎం సంపత్, సీసీలు డి సత్యనారాయణ, ఎస్ వెంకటమల్లు, రైతులు, ఐకేపీ సిబ్బంది, పాల్గొన్నారు. నిబంధనల మేరకు తేమశాతం ఉన్నప్పుడే వడ్లు కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే వెంటనే తూకం వేయడానికి అవకాశం ఉంటుందని చౌహాన్ అన్నారు. చొప్పదండి మండలం రుక్మాపూర్‌లోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. పంట పూర్తయిన తర్వాతే కోతలకు వెళ్లాలని, అప్పుడు కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదన్నారు. వెంట సహకార అధికారి రామానుజం, పీఏసీఎస్ కార్యదర్శి క్లోం తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు


పుస్తక ప్రదర్శనను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సరిత

వీణవంక: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రథాలయ ముగింపు వారోత్సవాలలో సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ రాజిరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, జ్ఞాన సంపదకు విజ్ఞాన కేంద్రాలుగా భవితకు బాట వేసే నిధిగా ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు రామ్మోహన్, అధ్యాపకులు భాస్కర్, శోభన్, రవీందర్, కల్పన, స్వప్న, సుమలత ఉన్నారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సైనిక శిక్షణ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీరావు, ప్రిన్సిపాల్ కాళహస్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లైబ్రేరియన్ సుధాకర్‌రెడ్డి బహుమతులు పదానం చేశారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడానికి పోటీలు ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయగా పుస్తక ప్రదర్శనను ప్రిన్సిపాల్ సరిత సందర్శించారు. కొత్త పుస్తకాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆసక్తి కలిగించిన పుస్తక వివరాలు నమోదు చేసుకున్నారు. గ్రంథాలయన్ని వినియోగించుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి శ్వేత, సృతజనాత్మకత ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి


ఆసుపత్రిలోని వివిధ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

మానకొండూర్‌రూరల్: ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. మండలంలోని వెల్ది, మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్ సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. మహిళలను సాధారణ ప్రసవాలకు ప్రోత్సహించాలని రోగులకు బీపీ, షుగర్ మందులు పంపిణీ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డీఐవో సాజిదా, వైద్యులు సౌమ్య, సీహెచ్‌వో రాజు, సిబ్బంది ఉన్నారు.

వరికొయ్యలు కాల్చొద్దు


వరికొయ్యలకు నిప్పు పెట్టిన రైతులు

తిమ్మాపూర్: పంట కోసిన తర్వాత వరికొయ్యలు కాల్చొద్దని మండల వ్యవసాయాధికారి సురేందర్ రైతులకు సూచించారు. వానాకాలంలో మండలంలోని 18,224 ఎకరాల్లో వరి సాగుచేశారని ప్రస్తుతం కోతలు సాగుతున్నాయని, పంట కోసిన కొందరు రైతులు యాసంగి సాగుకు కొయ్యలకు నిప్పు పెడుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని భూసారం దెబ్బతింటుందని, భూమి పైపొరల్లోని సూక్ష్మజీవులు చనిపోతాయని, తర్వాత వేసే పంట దిగుబడిపై ప్రభావం ఉంటుందన్నారు. కొయ్యలు కుళ్లేలా చేస్తే భూమికి బలం అని, పొలంలో ఒకసాలు పెట్టి నీటిని పట్టడం ద్వారా కొయ్యలు కుళ్లి పొలానికి ఎరువులా తయారవుతుందని, రసాయన ఎరువులు వినియోగించాల్సిన అవసరం ఉండదన్నారు.

గోశాలకు పశుగ్రాసం




గన్నేరువరం: వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవస్థానం గోశాలకు ట్రాక్టర్ పశుగ్రాసాన్ని లయన్స్ క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి జీల ఎల్లయ్య సొంత ఖర్చులతో బుధవారం తరలించారు. ప్రతి ఏడాది లయన్స్ క్లబ్ సభ్యులు పశుగ్రాసం అందజేయడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి లయన్ తెల్ల భాస్కర్, లియో క్లబ్ అడ్వైజర్ లయన్ బూర శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాంపల్లి డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం మాట్లాడారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్ నిర్వహిస్తూ పరీక్షలను బహిష్కరిస్తుంటే ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారే పరిస్థితి ఉందని, వెంటనే బకాయిలను విడుదల చేయాలన్నారు. సమావేశంలో నాయకులు వంశీకృష్ణ, అంజి, సందీప్, రాజు, శ్రీకాంత్, మణికంఠ ఉన్నారు.



జమ్మికుంట: అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ మాధవిలత, హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ వినోద్‌కుమార్

అంతర్జాతీయ బాలల దినోత్సవం


తిమ్మాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో బుధవారం అంతర్జాతీయ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో ఎక్సైజ్ సీఐ, ఎస్సైలు గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాల బారిన పడి జీవితం నాశనం చేసుకోవద్దని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్య, విలువలతో జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. హాజరైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు.

రోడ్డుపై పడిపోయిన ధాన్యం బస్తాలు



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం శివారులో బుధవారం ట్రాక్టర్‌లో నుంచి ధాన్యం బస్తాలు కిందపడ్డాయి. మొలంగూర్‌లోని కొనుగోలు కేంద్రంలో పాత గన్నీ సంచుల్లో ఓ రైతు ధాన్యం తూకం వేసి ట్రాక్టర్‌లో కేశవపట్నం మిల్లుకు తరలిస్తుండగా కేశవపట్నం శివారులో బస్తా చిరిగి ధాన్యం రోడ్డంతా దారపోసింది. ట్రాక్టర్ డ్రైవర్ రైతుకు సమాచారం అందించడంతో రోడ్డుపై ధాన్యాన్ని కుప్పగా పోసి మరో సంచిలో నింపి మిల్లుకు తరలించారు. పాత గన్నీ సంచుల్లో ధాన్యం నింపడంతో చిరిగిపోతున్నాయని రైతులు ఆరోపించారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఎండి అయాజ్


అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అయాజ్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. బుధవారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో మున్సిపల్‌కు సంబంధించిన స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతుండగా పలుమార్లు నోటీసులు ఇచ్చామని బుధవారం రాత్రి వరకు ఆక్రమించిన స్థలంలో నిర్మాణాన్ని కూల్చేస్తే, ఇతర ఇంటికి నష్టం జరగకుండా ఉంటుందని తెలిపారు. టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి కొలతలు వేస్తే ప్రభుత్వ భూమి ఆక్రమించినట్లు తేలిందన్నారు. లేని పక్షంలో జేసీబీతో కూల్చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీధర్, ప్రదీప్‌కుమార్, వార్డు ఆఫీసర్ రామరాజు, సిబ్బంది ఉన్నారు.

నేత్రదానంపై అవగాహన


జ్ఞాపిక అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

జమ్మికుంట: పట్టణానికి చెందిన వివాహిత రాసమల్ల రోజా ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం సన్మరణ సభ, నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నరహరి మాట్లాడుతూ.. నేత్రదానంతో అంధులకు చూపు ప్రసాదించినవారు అవుతారని అన్నారు. అనంతరం భర్త రవికుమార్, కూరురు నిహారిక, కుమారుడు కార్తికేయ, కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాయికంటి రాజు, వెంకటేశ్వర్లు, శివానందయ్య, చిదురాల శ్రీనివాస్, ముత్యాల జగదీశ్వర్, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామ శివారు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రెడ్డిపల్లి గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. డ్రైవర్ సాయి గణేశ్, ఓనర్ రాజయ్యపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

విమర్శలు మానుకోవాలి

వీణవంక: ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బొబ్బల కొండాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లన్నపల్లి గ్రామంలో బుధవారం మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అప్పుల ఊబిలో నెట్టిందని, సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడం లేదని, ధాన్యం తరలించిన మరుసటి రోజే డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతున్నాయని, రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం రైతుల కోసం అహర్నిశలు కష్టపడుతుందని తెలిపారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

మానకొండూర్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాపాక రమణయ్య (52) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ బుధవారం పరామర్శించారు.

నిధులు విడుదల చేయాలి

జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు రెండో విడుత నిధులు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆలస్యం చేస్తుందని జనతాదళ్ పార్టీ (జెడీఎస్) రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి అన్నారు. బుధవారం పట్టణంలో మాట్లాడారు. బడుగు,బలహీన వర్గాల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకొని వెంటనే నిధులు విడుదల చేసి న్యాయం చేయాలన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో బుధవారం నూతన వధూవరులు సమత-సుశీధర్‌రెడ్డిని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆశీర్వదించారు. గ్రామానికి చెందిన ఉప్పుగల్ల శ్రీనివాస్‌రెడ్డిరమ కూతరు వివాహం యైటింక్లయిన్‌కాలనీకి చెందిన అయిరెడ్డి సంపత్‌రెడ్డిశారద కుమారుడితో బుధవారం జరిగింది. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పెళ్లికి హాజరయ్యారు.

ర్యాండమ్ సర్వే

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో బుధవారం తహసీల్దార్ భాస్కర్ ర్యాండమ్ సర్వే చేశారు. గ్రామంలో ఎన్యూమరేటర్లు కులగణన సర్వే చేస్తుండగా గ్రామంలో పదిశాతం ర్యాండమ్ సర్వే చేశారు.

సీఎం వ్యాఖ్యలు అర్థరహితం

కరీంనగర్‌టౌన్: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌పై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం వేములవాడ సభలో చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం పరిధిలోకి తీసుకువచ్చిన ఘనత సంజయ్‌దేనని తెలిపారు. ఆయన కేంద్రమంత్రి అయ్యాక చేస్తున్న అభివృద్ధి పనులు సీఎంకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

సీపీఐ సభ్యత్వ నమోదు

కరీంనగర్‌రూరల్: పేద కోసం పోరాడిన ఘనత సీపీఐదేనని ఆ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీపీఐ వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ అన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని కోరారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్ల కోసం ఎన్నో ఉద్యమాలను చేశామని తెలిపారు. పల్లెల్లో సభ్యత్వ నమోదు చురుగ్గా నిర్వహించాలని సూచించారు.